అణు కేంద్రాలపైనే గురి

ఇరాన్‌పై కొనసాగిన ఇజ్రాయెల్ దాడులు ▪ ఇరాన్ సీనియర్ కమాండర్ ఇజాదీ మృతి ▪ దీటుగా క్షిపణులతో బదులిస్తున్న ఇరాన్

టెహ్రాన్, జెరూసలెం: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య శనివారం మరోసారి పరస్పర వైమానిక దాడులు చోటు చేసుకున్నాయి. టెహ్రాన్, ఇతర నగరాల్లోని కీలక అణు కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నది. ఇస్ఫహాన్ నగరంలోని అణ్వాయుధాల తయారీకి అవసరమయ్యే పరికరాలు తయారు చేసే అణు కేంద్రంపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో ఎలాంటి విష వాయువులు లీక్ కానట్టు తెలిసింది. ఇజ్రాయెల్ దాడులతో ఇస్ఫహాన్ నగరం దద్దరిల్లింది. ఖొండాబ్ అణు పరిశోధన రియాక్టర్ సమీపంలోనూ ఇజ్రాయెల్ దాడులు చేసిందని ఇరాన్ పేర్కొంది. మరోవైపు తమ సైనిక దళాలు ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన కుడ్స్ ఫోర్స్ సీనియర్ కమాండర్ సయీద్ ఇజాదీని హతమార్చినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ శనివారం వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ నేవీ లెబనాన్‌కు చెందిన నకౌరా నగర సమీపంలో హిజ్బుల్లా స్థావరంపై దాడి చేసినట్లు ఆయన చెప్పారు. ఇంకోవైపు ఇజ్రాయెల్‌కు దక్షిణాన ఉన్న హైఫా బీర్‌షేబా నగరాలపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడులలో కనీసం 19 మంది ఇజ్రాయెలీ పౌరులు గాయపడ్డారు. గత శుక్రవారం రెండు దేశాల మధ్య ఘర్షణలు ప్రారంభమైన


టెల్ అవీవ్‌పైకి దూసుకొస్తున్న క్షిపణులను అడ్డగిస్తున్న ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ

నాటి నుంచి ఇరాన్‌లో 657 మంది మరణించగా 2,000 మందికిపైగా గాయపడ్డారని మానవ హక్కుల వార్తా సంస్థ తెలిపింది.

మా సాయం లేకుండా అణు కేంద్రాల ధ్వంసం సాధ్యం కాదు: ట్రంప్

తమ సాయం లేకుండా శత్రు దుర్భేద్యమైన ఇరాన్ భూగర్భ అణు పరిశోధనా కేంద్రాలను ధ్వంసం చేయగల సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదని ట్రంప్ స్పష్టం చేశారు. తన మిత్ర దేశమైన ఇజ్రాయెల్, తన ప్రాంతీయ శత్రువైన ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు పరిస్థితుల ఆధారంగా మద్దతు తెలియచేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధంలో యూరప్ పెద్దగా సహాయం ఏమీ చేయలేదని ఆయన చెప్పారు. 'యూరప్‌తో మాట్లాడేందుకు ఇరాన్ ఇష్టపడడం లేదు. అందుకే మాతో మాట్లాడాలని భావిస్తోంది. ఈ విషయంలో యూరప్ నుంచి సాయం ఏదీ సాధ్యపడదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌ని ఓడించాలంటే గ్రౌండ్ ఫోర్సెస్ అవసరమా అన్న విలేకరుల ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ..గ్రౌండ్ ఫోర్సుల గురించి తాను మాట్లాడదలచుకోలేదని, చివరిగా మాట్లాడాల్సింది గ్రౌండ్ ఫోర్సులతోనేని అన్నారు.

ఇరాన్‌లో 5.1 తీవ్రతతో భూకంపం

ఉత్తర ఇరాన్‌లోని సెమ్నన్ ప్రాంతంలో శుక్రవారం శక్తిమంతమైన భూకంపం సంభవించింది. 5.1 తీవ్రతతో సెమ్నన్‌కు నైరుతి దిశలో 27 కిలోమీటర్ల దూరంలో భూకంపం సంభవించింది. 18 కిలోమీటర్ల లోతున భూమిలో ఇది కేంద్రీకృతమైంది. అయితే, ఇరాన్ అణ్వస్త్ర పరీక్షలను నిర్వహించిందా అన్న ఊహాగానాలు ఈ భూకంపంతో ఏర్పడ్డాయి. అంతరిక్ష, క్షిపణి సముదాయం గల నగరానికి సమీపంలో భూకంపం సంభవించడం కూడా కలవరపాటుకు గురిచేస్తోంది. ఇరాన్ సైన్యం నిర్వహిస్తున్న సెమ్నన్ అంతరిక్ష కేంద్రం, సెమ్నన్ క్షిపణి సముదాయం ఆ ప్రాంతంలోనే ఉన్నాయి. భూకంపం కారణంగా ప్రాణ నష్టం ఏదీ జరగలేదని ఇరాన్ వార్తా సంస్థ ఇర్నా తెలిపింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌కు చెందిన న్యూక్లియర్ శాస్త్రవేత్త ఇసార్-తబతాబాయి-కమ్షే, ఆయన భార్య మరణించినట్టు రాయిటర్స్ వెల్లడించింది.

కోడలిని చంపి.. ఇంటి ముందు పూడ్చి పెట్టి..

- అదనపు కట్నం కోసం యూపీలో అత్త మామల వేధింపులు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ఫరీదాబాద్: అదనపు కట్నం కోసం కోడలిని చిత్ర హింసలకు గురిచేసిన అత్తమామలు చివరికి ఆమెను చంపి ఇంటి ముందు పెద్ద గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరిగిందీ ఘటన. పోలీసుల కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లాకు చెందిన తానుకుమార్‌కి, ఫరీదాబాద్‌కు చెందిన అరుణ్‌సింగ్‌తో రెండేండ్ల క్రితం వివాహం జరిగింది. అయితే, పెళ్లయిన కొన్ని రోజుల నుంచే తానుకుమార్‌కి వేధింపులు మొదలయ్యాయి. దీంతో తానుకుమార్ పుట్టింటికి వచ్చేసింది. ఆ తర్వాత పెద్దల జోక్యంతో ఏడాది క్రితం తిరిగి భర్త వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం తానుకుమార్ పరారైందని, ఆమెకు మానసిక వ్యాధితో బాధపడుతోందని ఆమె అత్తమామలు ప్రచారం చేశారు. ఆమె అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన తానుకుమార్ తండ్రి హకీమ్ ఫిరోదాబాద్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఇంటి ముందు పెద్ద గొయ్యి తీసి పూడ్చినట్టు ఉండటంతో అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శుక్రవారం జేసీబీతో గొయ్యిని తవ్వించగా 10 అడుగుల లోతున తానుకుమార్ మృతదేహం బయటపడింది. బాధితురాలి భర్త అరుణ్‌సింగ్‌తోపాటు ఆమె అత్తమామలు, ఆడపడుచును పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. విచారణ అనంతరం వారిని అరెస్ట్ చేస్తామని తెలిపారు.

ఆడుకుంటున్న చిన్నారిపై చిరుత దాడి

- అడవిలోకి లాక్కెళ్లడంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన
- తమిళనాడులో షాకింగ్ ఘటన

న్యూఢిల్లీ, జూన్ 21: అటవీ సమీప గ్రామంలోని ఓ ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేండ్ల చిన్నారిపై చిరుతపులి దాడి చేసి అడవిలోకి లాక్కెళ్లిన ఘటన తమిళనాడు కోయంబత్తూర్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. వాల్పరై పట్టణంలో రోష్ని అనే చిన్నారి తన ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా, అడవిలో నుంచి వచ్చిన చిరుత పులి బాలికపై దాడి చేసి అడవిలోకి లాక్కెళ్లింది. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు, అటవీ అధికారులు సెర్చ్ లైట్లు, డ్రోన్లు, స్నిఫర్ డాగ్‌లతో కూడిన బృందాలు ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టారు.

పెళ్లికి ఒప్పుకోలేదని యువతులపై కాల్పులు

రోహ్‌తక్: తన పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించారన్న కోపంతో ఓ వ్యక్తి హర్యానాలోని జింద్ జిల్లా పిల్ ఖేరా వద్ద ఇద్దరు అక్కచెల్లెళ్లపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన సీను(27), రీతు(21) అనే ఇద్దరు ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కల్వా గ్రామానికి చెందిన ఈ యువతులు షాపింగ్ చేసుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. కర్నల్‌కు చెందిన సునీల్ కుమార్ వీరిపై తుపాకీతో కాల్పులు జరిపి కారులో పారిపోయినట్లు వారు చెప్పారు. నిందితుడు బాధిత మహిళలకు బంధువవుతాడని వారు చెప్పారు. రీతూను వివాహం చేసుకోవాలని నిందితుడు భావించాడని, అయితే రీతూ తల్లిదండ్రులు అందుకు ఒప్పుకోలేదని, దీంతో అతడు ఇద్దరు సోదరీమణులపై కాల్పులు జరిపినట్టు సమాచారం.

ట్రంప్ తాత్సారంతో అయోమయం!

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా జోక్యంపై నెతన్యాహుకు తప్పని ఎదురు చూపులు

వాషింగ్టన్, జెరూసలెం: ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణలలో జోక్యం చేసుకుని ఇరాన్‌పై దాడి చేసే విషయమై రెండు వారాలలో నిర్ణయం తీసుకోవాలని అమెరికా తనకు తానుగా విధించుకున్న గడువు ఇజ్రాయెల్‌ను గందరగోళంలోకి నెట్టివేసింది. ఇజ్రాయెల్‌కు చెందిన అత్యంత సీనియర్ అధికారులు అమెరికా జోక్యాన్ని బహిరంగంగా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాను ప్రశాంతంగా శాంతియుత ప్రాంతంగా మార్చి, అణ్వస్త్రాలను సంపాదించుకున్న ఇరాన్ నుంచి ప్రపంచాన్ని విముక్తి చేయాల్సిన బాధ్యత అమెరికాకు, ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఉందని ఇజ్రాయెల్ మాజీ రక్షణ మంత్రి యోవ్ గ్యాలంట్ సీఎన్ఎన్‌కి తెలిపారు. ఇరాన్‌పై సాగుతున్న పోరులో తమతో అమెరికా చేతులు కలిపితే పోరాట స్వరూపమే మారిపోతుందని, ఇరాన్‌కు చెందిన ఫోర్డో అణు కేంద్రాన్ని విజయవంతంగా ధ్వంసం చేసే అవకాశం ఉంటుందని ఇజ్రాయెల్ సీనియర్ అధికారులు పలువురు సీఎన్ఎన్‌కి తెలిపారు. టెహ్రాన్‌కు దక్షిణాన ఓ పర్వతం కింద భూగర్భంలో ఫోర్డో అణు పరిశోధనా కేంద్రాన్ని ఇరాన్ నిర్మించింది. చాలా లోతున ఉన్న ఆ అణు కేంద్రాన్ని ధ్వంసం చేయాలంటే *30,000 పౌండ్ల(13,600 కిలోల)* బంకర్ బస్టర్ బాంబులు అవసరమవుతాయని, వీటిని అమెరికన్ బాంబర్లు మాత్రమే మోసుకువెళ్లగలవని వారు తెలిపారు.

ఇరాన్ అణ్వస్త్ర తయారీపై ఆధారాల్లేవ్!

ఇరాన్ అణ్వస్త్రాన్ని తయారు చేస్తోందనడానికి ఎటువంటి ఆధారాలు లేవని అమెరికా జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్ తులసీ గబ్బర్డ్ చేసిన వ్యాఖ్యలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు. ఆమె అభిప్రాయం తప్పని ట్రంప్ శుక్రవారం చెప్పారు. అణ్వస్త్రాల తయారీపై ఇరాన్ నిర్ణయం తీసుకుంటే కొన్ని వారాలు లేదా కొన్ని నెలలలో వాటిని తయారు చేయగల సామర్థ్యం ఆ దేశానికి ఉందని అమెరికా నిఘా సంస్థ వద్ద సమాచారం ఉందని శుక్రవారం ఎక్స్‌లో గబ్బర్డ్ తెలిపారు. దీనిపై విలేకరుల వద్ద ట్రంప్ స్పందిస్తూ మార్చిలో ఆమె చెప్పిన విషయాన్ని మీడియా ఇప్పుడు అసందర్భంగా ప్రస్తావించిందని, తమ మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. అయితే అణ్వస్త్రాలను తాము తయారు చేస్తున్నామన్న ఆరోపణలను ఇరాన్ ఖండించింది.

బరాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ డీఆర్డీవో కీలక పాత్ర

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో భాగంగా ఇరాన్ భారీ క్షిపణులతో చేస్తున్న దాడులను తిప్పి కొట్టేందుకు బరాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఇజ్రాయెల్ వినియోగిస్తున్నది. మానవ రహిత ఏరియల్ వాహనాలతో పాటు క్షిపణులను కూడా సమర్థంగా అడ్డుకుంటున్నది. బరాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అభివృద్ధిలో ఇజ్రాయెల్ ఏరోస్పేస్‌తో పాటు భారత్‌కు చెందిన డీఆర్‌డీవో కూడా పాలు పంచుకుంది. ఈ వ్యవస్థ యూఏవీలు, క్రూయిజ్ క్షిపణులతో పాటు ఎయిర్ బోర్న్ టార్గెట్లను ఎదుర్కోగలదు.

ఆ సీనియర్ అధికారులను తొలగించండి

విమాన ప్రమాదంపై ఎయిరిండియాకు డీజీసీఏ ఆదేశం

న్యూఢిల్లీ, జూన్ 21: విమాన ప్రమాదం నేపథ్యంలో ఎయిరిండియాకు డీజీసీఏ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎయిరిండియాలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అధికారులను తొలగించాలని ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. వెంటనే వారిపై అంతర్గత క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ ఇటీవల కుప్పకూలి మంటల్లో దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీజీసీఏ కొంతమంది అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలకు ఉపక్రమించింది. ఈ ముగ్గురు అధికారులు సిబ్బంది షెడ్యూల్, రోస్టర్ విధులు నిర్వహిస్తున్నట్టు సంబంధిత వర్గాల సమాచారం.

ఉల్లంఘనలపై నోటీసులు

ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్(ఎఫ్‌డీటీఎల్) ఉల్లంఘించినందుకు టాటా గ్రూపు యాజమాన్యంలోని ఎయిర్ ఇండియాకు డైరెక్టర్ జనరల్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు శనివారం సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మే 16, 17న ఎయిర్ ఇండియాకు చెందిన బెంగళూరు-లండన్ విమానాలను తనిఖీ చేసిన సందర్భంగా ఈ ఉల్లంఘనలు బయటపడినట్లు వర్గాలు తెలిపాయి. ఈ తనిఖీలలో 10 గంటల పరిమితిని ఉల్లంఘించినట్లు గుర్తించామని షోకాజ్ నోటీసులో డీజీసీఏ పేర్కొంది.

ఉత్సాహంగా టైమ్స్ స్క్వేర్ వద్ద యోగా

న్యూయార్క్, మదురై, జూన్ 21: న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్, టైమ్స్ స్క్వేర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైన చౌరస్తాగా పరిగణించే టైమ్స్ స్క్వేర్ వద్ద యోగ అభ్యాసకులు, స్థానికులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. టైమ్స్ స్క్వేర్ మధ్యలో వందలాది మంది యోగాసనాలు వేస్తున్న ఫొటోలను భారత కాన్సులర్ జనరల్ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు.

73 ఏండ్లు.. 51 పుష్ అప్‌లు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 73 ఏండ్ల తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ఫిట్‌నెస్ అందరినీ విస్మయానికి గురిచేసింది. మదురైలోయోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ రవి 51 పుష్ అప్‌లు పూర్తి చేసి శారీరక దారుఢ్యానికి వయసుతో పని లేదని నిరూపించారు.

ఏడేండ్ల జైలు.. 10 లక్షల జరిమానా

- తప్పుడు వార్తల ప్రచారానికి శిక్ష
- కర్ణాటకలో ముసాయిదా చట్టం

బెంగళూరు, జూన్ 21: తప్పుడు వార్తలు పోస్టింగ్ చేసినా, ప్రచారం చేసినా ఏడేండ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే దిశగా కర్ణాటక ప్రభుత్వం ఓ చట్టాన్ని తేనున్నది. తప్పుడు సమాచారాన్ని అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం ఈ మేరకు ఓ ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. కర్ణాటక మిస్‌ఇన్‌ఫర్మేషన్ అండ్ ఫేక్ న్యూస్ (ప్రొహిబిషన్) చట్టం ముసాయిదాను ఈ వారం ప్రారంభంలో క్యాబినెట్ ముందుంచారు. ఈ చట్టం అమలులోకి వస్తే సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వార్తలను అరికట్టే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లభిస్తుంది. ఫేక్ న్యూస్‌ను అరికట్టేందుకు ఓ మంత్రి నేతృత్వంలో ఆరు సభ్యులతో ఒక నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయనున్నారు.కేసులను విచారించేందుకు ప్రత్యేక కోర్టును నెలకొల్పనున్నారు.

దోమ సైజులో నిఘా డ్రోన్

సైనిక రహస్యాల చిత్రీకరణకు సృష్టించిన చైనా సైనిక ల్యాబ్

న్యూఢిల్లీ: సైనిక కార్యకలాపాలను రహస్యంగా కనిపెట్టేందుకు చైనాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ(ఎన్‌యూడీటీ)కు చెందిన ఓ రోబోటిక్స్ ప్రయోగశాల దోమ పరిమాణంలో ఉన్న ఓ బుల్లి డ్రోన్‌ను తయారుచేసింది. హ్యూమనాయిడ్ మిషన్ల నుంచి కంటికి కనిపించని పరిమాణంలో ఉండే సూక్ష్మ డ్రోన్ల వరకు ప్రయోగశాలలో తాము తయారుచేసిన రోబోలను ఎన్‌యూడీటీ పరిశోధకులు చైనా సెంట్రల్ టెలివిజన్‌కు చెందిన సైనిక చానల్‌లో గత వారాంతంలో ప్రదర్శించారు. దోమంత సైజులో ఉన్న ఓ సూక్ష్మ డ్రోన్‌ను తన చేతివేళ్లలో ఉంచుకుని టీవీ వీక్షకులకు చూపించిన ఓ ఎన్‌యూడీటీ విద్యార్థి ఈ తరహా మైక్రో డ్రోన్లు యుద్ధ రంగంలో శత్రువులకు సంబంధించిన సైనిక రహస్యాలను చిత్రీకరించి, తీసుకువస్తుందని చెప్పాడు.

మాపై దాడులను భారత్ ఖండించాలి

- ఇరాన్ దౌత్యవేత్త జావెద్ వ్యాఖ్య
- చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నెతన్యాహుకు యూఏఈ, తుర్కియే అగ్ర నేతల సూచన

న్యూఢిల్లీ, టెహ్రాన్: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ దాడులను భారత్ ఖండించాలని ఇరాన్ దౌత్యవేత్త కోరారు. ఇరానియన్ ఎంబసీ మిషన్ డిప్యూటీ చీఫ్ జావెద్ హొస్సేనీ మాట్లాడుతూ భారత్ అధికారులతో తాము చర్చలు జరిపామని, అయితే ఇజ్రాయెల్, ఇరాన్ విషయంలో భారత్ తటస్థ వైఖరితో ఉందని అన్నారు. ఎందుకంటే రెండు దేశాలతోనూ భారత్‌కు మంచి సంబంధాలున్నాయన్నారు. అయితే ఇది ఒక దేశానికి సంబంధించిన దురాక్రమణ విషయమని, అంతర్జాతీయ చట్టం ప్రకారం దానిని ఖండించాలని అన్నారు. గ్లోబల్ సౌత్‌కు ఇండియా లీడర్ అని, ఇజ్రాయెల్

శనివారం ఇరాన్ నుంచి స్వదేశానికి చేరుకున్న భారతీయులు

దాడులను న్యూఢిల్లీ వ్యతిరేకించాలని ఇరాన్ ఆశిస్తోందని, భారత్‌తో పాటు ప్రతి దేశం ఇజ్రాయెల్ దాడులను ఖండించాలని ఆయన కోరారు. కాగా, మధ్య ప్రాచ్యంలో శాంతి ప్రక్రియకు ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు పెద్ద ఆటంకంగా మారారని తుర్కియే అధ్యక్షుడు శనివారం రెసెప్ ఎర్డోగాన్ ఆరోపించారు. ఇరాన్‌తో అమెరికా మరో విడత అణు శాంతి చర్చలు జరిపే ముందు ఆ దేశంపై దాడులు జరపడం చర్చల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని, శాంతి చర్చల ద్వారా సమస్య పరిష్కారం కావడం ఇజ్రాయెల్ అధ్యక్షుడిని ఇష్టం లేనట్టు కన్పిస్తున్నదని ఆయన విమర్శించారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధాన్ని త్వరగా ముగించాలని అరబ్ ఎమిరేట్స్ సీనియర్ అధికారి ఒకరు విజ్ఞప్తి చేశారు. యుద్ధం ఇలాగే కొనసాగితే కష్టతరమైన పరిణామాలు ఏర్పడుతాయని అన్నారు. ఈ యుద్ధం సంపద ఉన్న గల్ఫ్ ప్రాంతాన్ని వెనక్కి నెట్టేస్తున్నదని యూఏఈ అధ్యక్షుడి దౌత్య సలహాదారు అన్వర్ గార్గష్ అన్నారు.

500 మందికి పైగా భారతీయుల తరలింపు

యుద్ధం నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధు కింద శనివారం నాటికి 500 మందికి పైగా భారతీయులను ఇరాన్ నుంచి మన దేశానికి తీసుకువచ్చినట్టు భారత విదేశాంగ శాఖ మంత్రి ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ తన పౌరులందరినీ ఇరాన్ నుంచి తరలిస్తున్నదని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది.

ఇదేం సిఫారసు పాకిస్థాన్?

- ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేసిన దాయాది ప్రభుత్వం
- పాక్‌కు ఉన్న కాస్త గౌరవం పోయిందని పలువురు ప్రపంచ మేధావుల విమర్శ

న్యూఢిల్లీ, జూన్ 21: ప్రపంచ శాంతికి కృషి చేసిన వారికి ఇచ్చే నోబెల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును పాకిస్థాన్ నామినేట్ చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాజాతో 'జాతి నిర్మూలన యుద్ధం', ఇరాన్‌పై బాంబు దాడికి ట్రంప్ మద్దతు ఇచ్చిన విషయాన్ని పాక్‌కు గుర్తు చేస్తూ అనేక మంది పాకిస్థాన్ హక్కుల కార్యకర్తలు, రచయితలు సామాజిక మాధ్యమం ద్వారా ఆ ప్రభుత్వ చర్యను నిశితంగా విమర్శించారు.

భారత్ ఒక పక్క ప్రకటిస్తున్నా...

భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ద్వైపాక్షిక చర్చల ద్వారానే జరిగింది తప్ప, అందులో ట్రంప్ ప్రమేయం లేదంటూ భారత దేశం ఇప్పటికే పలుసార్లు ప్రకటించింది.అయినప్పటికీ యుద్ధాన్ని ఆపిన క్రెడిట్‌ను పాకిస్థాన్ ట్రంప్‌కు కట్టబెట్టడంపై పాక్ మేధావులు విమర్శిస్తున్నారు.

సిఫార్సు దయనీయం

ట్రంప్ పేరును పాకిస్థాన్ ప్రభుత్వం నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేయడం దయనీయమని రచయిత, పాకిస్థాన్ జర్నలిస్టు జాహిద్ హుస్సేన్ విమర్శించారు. గాజా యుద్ధం వెనుక ఉండి సహాయపడి, ఇప్పుడు ఇరాన్ ఆక్రమణకు సహకరిస్తున్న ట్రంప్ పేరును ఎలా ప్రతిపాదిస్తారని ఆయన ప్రశ్నించారు. కృతజ్ఞత అనేది విధానంగా పనిచేయదని, పాకిస్థాన్ ప్రభుత్వ నిర్ణయం దురదృష్టకరమని ఐరాసలో పాకిస్థాన్ రాయబారిగా పనిచేసిన మలీహ లోధి పేర్కొన్నారు.

అద్దె దేశంగా మిగిలిపోయింది

పాకిస్థాన్‌ది కీలుబొమ్మ పాలన, శూన్య గౌరవ ప్రభుత్వమని పలువురు విమర్శించారు. అది అగ్రదేశ ప్రాభవం కోసం పాకులాడుతున్నదని, ఏ మాత్రం గౌరవం లేకుండా ట్రంప్‌ను నోబెల్ బహుమతికి ప్రతిపాదించిందని హక్కుల నేత రిదా రషీద్ ట్వీట్ చేశారు.

నాకు నోబెల్ బహుమతి రాకపోవచ్చు!

భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం ఆపి శాంతికి కృషి చేశానని శుక్రవారం ట్రంప్ మళ్లీ పాతపాటే పాడారు. అయితే ఈ రెండు దేశాల మధ్య గత నెల యుద్ధాన్ని ఆపినందుకు తాను చేసిన కృషికి నోబెల్ శాంతి బహుమతి రాకపోవచ్చునని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

అవాంఛిత గర్భాన్ని కొనసాగించాలని ఒత్తిడి చేయలేం

బాలిక అబార్షన్ కేసులో బాంబే హైకోర్ట్

ముంబై: అవాంఛిత గర్భాన్ని కొనసాగించమంటూ లైంగిక దాడి బాధితురాలిని ఒత్తిడి చేయలేమని పేర్కొన్న బాంబే హైకోర్టు, వైద్య నిపుణుల నుంచి ప్రతికూల నివేదిక వచ్చినప్పటికీ ఆమె 28 నెలల గర్భాన్ని తొలగించుకోవడానికి అనుమతిని మంజూరు చేసింది. ఆమె అభీష్టానికి వ్యతిరేకంగా బిడ్డను కనాలని ఒత్తిడి చేయడం, ఆమె తన జీవన గమనాన్ని నిర్ణయించుకునే హక్కును అందకుండా చేయడమే అవుతుందని న్యాయస్థానం పేర్కొంది. బాధితురాలి వయస్సు, గర్భస్థ శిశువు స్థితిని పరిశీలించిన తర్వాత బాలిక గర్భ విచ్ఛిత్తి చాలా ప్రమాదకరమని బాలికను పరీక్షించిన మెడికల్ బోర్డు న్యాయస్థానానికి తెలిపింది. అయినప్పటికీ బాలిక గర్భస్రావానికి అనుమతినిస్తూ జస్టిస్‌లు సాంబ్రే, సచిన్ దేశ్‌ముఖ్‌లతో కూడిన ధర్మాసనం ఈ నెల 17న ఆదేశాలు జారీ చేసింది. 12 ఏండ్ల బాలికపై ఆమె మామ అత్యాచారం చేయడంతో ఆమె గర్భవతి అయ్యింది. ఈ కేసులో ఆమె గర్భాన్ని తొలగించేలా ఆదేశాలివ్వాలంటూ బాధితురాలి తండ్రి హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

పాక్ గొంతెండిపోతోంది!

అయినా 'సింధూ' ఒప్పందాన్ని పునరుద్ధరించం: అమిత్ షా

న్యూఢిల్లీ:పాక్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని ఎప్పటికీ పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పాకిస్థాన్‌కు దాహంతో అలమటిస్తోందని.. అయినా ఆ దేశానికి ప్రవహించే నీటిని కెనాల్ నిర్మించి రాజస్థాన్‌కు సరఫరా చేస్తామని తెలిపారు. టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇంటర్వ్యూ ఇచ్చిన అమిత్ షా పలు కీలక విషయాలు వెల్లడించారు.

బట్టతల నివారణకు సరికొత్త చికిత్స!

- *ఎలుకల్లో 100 శాతం జుట్టు తిరిగి పెరుగుదల*
- *కొత్త విధానాన్ని కనుగొన్న మాడ్రిడ్ సైంటిస్టులు*

మాడ్రిడ్, జూన్ 21: పురుషులు, స్త్రీలలో జుట్టు రాలటం సర్వసాధారణం. వైద్య పరిభాషలో 'ఆండ్రోజెనెటిక్ అలోపేసియా'గా పిలుచుకునే ఈ సమస్యకు మాడ్రిడ్‌లోని సాన్ కార్లోస్ క్లినికల్ దవాఖాన సైంటిస్టులు నివారణ కనుగొన్నారు. జుట్టు రాలటాన్ని నివారించగల సరికొత్త చికిత్స విధానాన్ని పరిశోధకులు అభివృద్ధి చేశారు. వీరు కనుగొన్న పద్ధతుల్లో చేసిన ప్రయోగాల్లో ఎలుకల్లో 100 శాతం జుట్టు తిరిగి పెరగడానికి దారి తీసింది. అన్ని మగ ఎలుకల్లో జుట్టు పూర్తిగా తిరిగి ఏర్పడగా, ఆడ ఎలుకల్లో 90శాతం పూర్తి జుట్టు పునరుద్ధరణ జరిగింది. ప్రధాన పరిశోధకుడు ఎడ్వర్డ్ లోపెజ్ బ్రాన్ మాట్లాడుతూ, ఏటీపీ (జీవ కణాల్లో శక్తిని నిల్వ చేసేది, శక్తిని బదిలీ చేసేది) శక్తికి మూల కణాల పునరుత్పత్తి సామర్థ్యాన్ని కలపడం జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తున్నదని వివరించారు. మనుషులపై ఇందుకు సంబంధించి ప్రయోగ పరీక్షలు తప్పనిసరి అయినప్పటికీ, జుట్టు రాలడాన్ని పరిష్కరించటంలో ప్రయోగ ఫలితాలు ఆశాజనకమైన ముందడుగా భావిస్తున్నట్టు చెప్పారు. మానవులపై ట్రయల్స్ జరిపి..ప్రయోగ ఫలితాల్ని నిర్ధారించుకోవాల్సిన అవసరముందని పరిశోధకులు భావిస్తున్నారు.

హెచ్ఐవీ నివారణకు టీకా

- ఆమోదించిన అమెరికా

న్యూయార్క్: ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న హెచ్ఐవీ వైరస్‌పై చిరకాల పోరాటం ఫలించింది. దశాబ్దాలుగా మహమ్మారిపై జరుగుతున్న పోరాటంలో ఒక మైలురాయిగా నిలుస్తూ ప్రపంచంలోనే తొలిసారిగా సంవత్సరానికి రెండుసార్లు ఇచ్చే హెచ్ఐవీ టీకాను అమెరికా ఆమోదించింది. కనీసం 35 కేజీల బరువున్న పెద్దలు, కౌమార దశలో ఉన్న వారికి ప్రెప్ ఇంజక్షన్‌గా ఉపయోగించడానికి ఎఫ్‌డీఏ అనుమతిని ఇచ్చింది.

సముద్రపు దోసకాయలతో క్యాన్సర్‌కు చెక్!

న్యూఢిల్లీ: క్యాన్సర్‌కు చికిత్సలో యూనివర్సిటీ ఆఫ్ మిస్సిస్సిపి శాస్త్రవేత్తలు సరికొత్త పరిశోధనను తెరపైకి తెచ్చింది. సముద్రపు దోసకాయలుగా పిలువబడే జీవుల్లో ఉన్న చక్కెర కణాలు మనిషి శరీరంలో క్యాన్సర్ వ్యాప్తిని నిరోధిస్తాయని తేల్చి చెప్పారు. దీనిద్వారా సంప్రదాయ చికిత్సల మాదిరిగా శరీరానికి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవని తెలిపారు. ఈ జీవుల్లో ఉన్న 'ఫ్యూకో సైలేటెడ్ కొండ్రోయిటిన్ సల్ఫేట్' అనే రసాయనం క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుంటుందని తమ పరిశోధనల ద్వారా సైంటిస్టులు తేల్చారు. భవిష్యత్‌లో క్యాన్సర్ చికిత్సలో ఇది కీలకంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ బృందంలో జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన సైంటిస్టులు కూడా ఉన్నారు. ఈ సముద్రపు దోసకాయల్లోని చక్కెర కణాలు మనుషులకు ఎలాంటి హాని కలిగించవని, రక్తపోటు, రక్తం గడ్డ కట్టడం లాంటి సమస్యలు తలెత్తవని వెల్లడించాయి. అయితే ప్రస్తుతం ఈ బృందం సరికొత్త సవాలును ఎదుర్కొంటున్నది. ఈ సముద్రపు దోసకాయలు తగినంతగా అందుబాటులో లేకపోవడం కారణంగా ఇప్పటికిప్పుడు ఔషధంగా మార్చలేకపోతున్నట్టు సైంటిస్టులు వెల్లడించారు. దీనిపై విస్తృతంగా పరిశోధనలు చేస్తామని, ఇది విజయవంతమైతే క్యాన్సర్ చికిత్సలో మరో మైలురాయిగా మారబోతుందని సైంటిస్టులు చెప్తున్నారు.

గాల్లో కాలి నేలకూలిన హాట్ బెలూన్

బ్రెజిల్‌లో 8 మంది దుర్మరణం

రియో డి జనెరియో, జూన్ 21: ఆకాశంలో ఉండగా, హాట్ ఎయిర్ బెలూన్‌కు నిప్పంటుకుని కింద కూలిన ప్రమాదంలో 8 మంది మరణించిన ఘటన బ్రెజిల్‌లో శనివారం చోటుచేసుకుంది. శాంత కతర్నియా జిల్లాలో చోటుచేసుకున్న ఈ దృశ్యానికి సంబంధించిన వీడియోను స్థానిక వార్తా సంస్థ జీ1 విడుదల చేసింది. దాని ప్రకారం భారీగా ఎగసిన మంటల్లోంచి పొగలు వస్తుండగా, ఆకాశం నుంచి దూసుకు వచ్చిన బెలూన్ నేలపై పడింది. ప్రమాద సమయంలో 21 మంది బెలూన్‌లో ఉండగా, వారిలో 8 మంది మరణించారని, గాయపడిన 13 మందిని దవాఖానలకు తరలించినట్టు మిలిటరీ ఫైర్ బ్రిగేడ్ తెలిపింది. ప్రమాదానికి కారణం తెలియరాలేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. జూన్ నెలలోసెయింట్ జాన్ వంటి క్యాథలిక్ గురువుల ఉత్సవాల సందర్భంగా ఈ హాట్ బెలూన్‌లపై పౌరులు ఎక్కువగా ప్రయాణిస్తూ ఉంటారు.